ఎయిర్‌పోర్టుల తరహాలో రైల్వేస్టేషన్‌ల ఆధునికీకరణ

- 26న ప్రధాని చేతుల మీదుగా శంకుస్థాపన

హైదరాబాద్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఎయిర్ పోర్టుల తరహాలో రైల్వే స్టేషన్లను ఆధునికీకరించనున్నట్టు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ తెలిపారు. జోన్ పరిధిలో సుమారు రూ.1800కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదించిన, పూర్తి చేసిన పనులకు ఫిబ్రవరి 26న ప్రధాని నరేంద్రమోదీ శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు. శనివారం రైల్ నిలయంలో అరుణ్‌కుమార్ జైన్ విలేకరులతో మాట్లాడుతూ తమ జోన్ పరిధిలో సుమారు రూ.925 కోట్ల వ్యయంతో 57 రైల్వే స్టేషన్‌లను ఆధునికీకరించనున్నట్టు తెలిపారు. ఇందులో తెలంగాణలో 15స్టేషన్‌లు, ఆంధ్రప్రదేశ్‌లో 34 స్టేషన్లను అమృత్ స్టేషన్‌ల కింద అభివృద్ధి చేయనున్నట్టు వివరించారు. తెలంగాణలో చేపట్టనున్న అమృత్ స్టేషన్‌ల అభివృద్ధి కోసం రూ.230 కోట్లకు పైగా నిధులు వ్యయం చేయనున్నారు. ప్రధానంగా దేశ వ్యాప్తంగా రైల్వే స్టేషన్‌లను ఎయిర్‌పోర్టుల మాదిరిగా అభివృద్ధి చేసే లక్ష్యంతో కోట్లాది నిధులతో సౌకర్యాలను మెరుగుపరిచి ఆధునికీకరించనున్నట్టు తెలిపారు.

బ్యాటరీ వీల్ చైర్

- తయారుచేసిన సెయింట్ పీటర్స్ పాఠశాల విద్యార్థి ఇంద్రజిత్
- రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ సైన్స్ పోటీలకు ఎంపిక


బ్యాటరీ వీల్ చైర్

బోయినపల్లి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మక 2024 రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలకు సెయింట్ పీటర్స్ ఉన్నత పాఠశాల బోయినపల్లికి చెందిన 10వ తరగతి విద్యార్థి ఇంద్రజిత్ ఎంపికయ్యాడు. ఇన్‌స్పైర్ మనక్ పేరిట రాష్ట్రస్థాయి ప్రతిభా అవార్డుల ప్రధానోత్సవాలు సీబీఎస్ఈ జాతీయ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఈ క్రమంలో 2023 వరకు తెలంగాణలోని సీబీఎస్ఈ పాఠశాలలో చదువుతున్న 127 మంది ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థుల ను ఇటీవల ఆన్‌లైన్ విధానంలో ఎంపికచేశారు. అందులోంచి రెండురోజుల క్రితం 13 మంది అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. అందులో సెయింట్ పీటర్స్ పాఠశాల విద్యార్థి ఇంద్రజిత్ తయారు చేసిన బ్యాటరీతో నడిచే వీల్‌చైర్‌ను ఇన్‌స్పైర్ సైన్స్ పోటీల నిర్వాహకులు టాప్ వన్‌గా ఎంపిక చేశారు. రోగులను, వికలాంగులను తరలించడానికి ఈ వీల్‌చైర్లు ఉపయోగించడానికి ఎంతో తేలికగా ఉంటుంది. పాఠశాలలో ఏర్పాటుచేసిన అభినందన కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్న జిల్లా విద్యాశాఖ అధికారులు ధర్మేందర్‌రావు, ఆర్.రోహిణి, పాఠశాల యాజమాన్యం, సెయింట్ పీటర్స్ ఉన్నత పాఠశాల అధిపతి అల్ఫోన్స్‌రెడ్డి, అకాడమి డైరెక్టర్ టి.అరుణరెడ్డి ఇంద్రజిత్‌ను ఘనంగా అభినందించి సత్కరించారు.

యూజీసీ నిబంధనల ప్రకారమే సీనియర్ ప్రొఫెసర్లకు పదోన్నతులు

- ఓయూ రిజిస్ట్రార్ ప్రొ. లక్ష్మీనారాయణ

తార్నాక, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సీనియర్ ప్రొఫెసర్ల పదోన్నతుల్లో అక్రమాలు జరిగాయంటూ పలు దినపత్రికల్లో వస్తున్న వార్తలు నిరాధారమైనవని ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.లక్ష్మీనారాయణ స్పష్టం చేశారు. ఈ మేరకు ఓయూలోని గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యూజీసీ నిబంధనలకు అనుగుణంగానే పదోన్నతుల ప్రక్రియ జరిగిందని, జీవో నెం. 15 అనుసరించి, యూజీసీ నియమ నిబంధనలను తూచా తప్పకుండా పాటించామన్నారు. ఏమైనా అనుమానాలుంటే అడ్మినిస్ట్రేటివ్ అధికారులను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. ఎంతో పేరు ప్రఖ్యాతలున్న ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రతిష్ఠను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

గుజరాత్‌లోని గాంధీనగర్ ఐఐటీతో ఈసీఐఎల్ ఒప్పందం


ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న గాంధీనగర్ ఐఐటీ, ఈసీఐఎల్ సంస్థల అధికారులు

కుషాయిగూడ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్స్ రంగంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఈసీఐఎల్ సంస్థ మరో భారీ పరిశోధన ప్రాజెక్టును దక్కించుకుంది. గుజరాత్ గాంధీనగర్‌లోని ఐఐటీతో అటానమస్ నేవిగేషన్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్/మెషీన్‌లెర్నింగ్ (ఏఐ/ఎంఎల్) అప్లికేషన్‌ల రూపకల్పన, సెక్యూరిటీ విభాగానికి సంబంధించి ఇమేజ్ ప్రాసెసింగ్ టెక్నిక్స్ అంశాలలో సంయుక్తంగా పరిశోధనలు చేసేందుకు అంగీకరించింది. ఈమేరకు శనివారం గాంధీనగర్ ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ రజత్ మూనా, ఈసీఐఎల్ పర్సనల్ డైరెక్టర్ డాక్టర్ అనేష్ కుమార్ శర్మ పరస్పరం ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. కాగా, ఈనెల 16న గాంధీనగర్ ఐఐటీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రొఫెసర్ ఇన్‌చార్జ్ డాక్టర్ పి.మెహరోత్రా, ఈసీఐఎల్ జనరల్ మేనేజర్ సి.మురళీధర్ ఈ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.

సున్నితమైన పోలింగ్ కేంద్రాల గుర్తింపు

- తగిన జాగ్రత్తలపై అధికారులకు శిక్షణ

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సైబరాబాద్‌లోని స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, ఇతర అధికారులతో పోలీస్ కమిషనర్ అవినాశ్ మహంతి ఆదేశాల మేరకు శిక్షణా కార్యక్రమ జరిగింది. సున్నితమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించే విషయమై శనివారం సైబరాబాద్ కమిషనరేట్‌లోని మెయిన్ కాన్ఫరెన్స్ హాలులో జరిగిన కార్యక్రమంలో కమిషనరేట్‌కు చెందిన 100మంది అధికారులు హాజరయ్యారు. శిక్షణ కార్యక్రమంలో సెక్టార్ పోలీస్ అధికారులు, రెవెన్యూ సెక్టార్ అధికారుల సమన్వయంతో సున్నితమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించడం, గుర్తించిన కేంద్రం సున్నితమైందని చెప్పడానికి కారణాలేంటనే అంశాలతో జిల్లా ఎన్నికల అధికారికి పంపించేందుకు రిపోర్టు సిద్ధం చేయడం, ఆయా ప్రాంతాల్లో ఓటు వేసేలా పౌరుల్లో అవగాహన కల్పించడం, శాంతిభద్రతలను కాపాడుతూ ఎన్నికల నిర్వహణకు తీసుకోవాల్సిన ఏర్పాట్లు, జాగ్రత్తల గురించి నిపుణులు వివరించారు.

'బ్రెడ్ విన్నర్ స్కీం'లో అందరికీ ఉద్యోగం కల్పించాలి

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సర్వీసులో ఉండి చనిపోయిన కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించే 'బ్రెడ్ విన్నర్ స్కీం'లో దరఖాస్తు దారులకు అర్హతల ఆధారంగా ఉద్యోగం ఇవ్వాలని ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు వీరాంజనేయులు, ప్రధాన కార్యదర్శి వీఎస్‌రావు విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్‌కు శనివారం వారు వినతిపత్రం ఇచ్చారు. దశాబ్దకాలంగా ఆర్టీసీ విస్తరణ నిలిచిపోవడంతో బ్రెడ్ విన్నర్ స్కీంను అమలు చేయలేదని గుర్తు చేశారు. ఇటీవల కొంతమందిని రెగ్యులర్ ప్రాతిపదికన కాకుండా మూడేళ్ల కన్సాలిడేటెడ్ పేతో తీసుకున్నారని వారు పేర్కొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్


కలెక్టర్ శశాంక్‌కు బొకే అందజేస్తున్న జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ చంద్రశేఖర్‌గౌడ్

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్): రంగారెడ్డి జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్ శనివారం కలెక్టర్ శశాంక్‌ను చేవెళ్లలో మర్యాదపూర్వంగా కలిశారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా రవాణా శాఖలో జరిగిన బదిలీల్లో భాగంగా రంగారెడ్డి జిల్లా రవాణశాఖ అధికారి ప్రవీణ్‌రావు రాష్ట్ర కార్యాలయానికి బదిలీ అయ్యారు. కరీంనగర్ జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా విధులు నిర్వహించిన మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్ రంగారెడ్డి జిల్లా రవాణ శాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. చేవెళ్లలో ఈనెల 27న సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా ఏర్పాట్ల పరిశీలనకు విచ్చేన కలెక్టర్‌ను ఆయన కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎన్నికల్లో సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకం

- ఎన్నికల ప్రవర్తనా నియమావళి బృందాలైన ఎంసీసీ, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ, వీవీటీ, వ్యయ పరిశీలన అధికారులతో ఏఆర్వో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఆర్వో సైదులు

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఏఆర్వో పులి సైదులు ఆధ్వర్యంలో సెక్టోరల్, సెక్టోరల్ పోలీసు అధికారులు, ఎన్నికల నియమావళి బృందాల(ఎంసీసీ)తో శనివారం సమీక్షా సమావేశం, శిక్షణా తరగతులు నిర్వహించారు. ఎన్నికల్లో సెక్టోరల్ అధికారుల పాత్ర ఎంతో కీలకమని, మాక్ పోలింగ్ ఎలా నిర్వహించాలి, ఎన్నికల సమయంలో యంత్రాలు మొరాయిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏఆర్వో సూచించారు. ఎన్నికల యంత్రాల (బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీపాట్) అనుసంధానం, పనితీరును వివరించారు.

సెక్టోరల్ పోలీసు అధికారులు సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలను గుర్తిస్తే ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద మైక్రో అబ్జర్వర్, వెబ్‌కాస్టింగ్, అదనపు భద్రతా సిబ్బందిని కేటాయిస్తామన్నారు. సెక్టోరల్ అధికారులు నియోజకవర్గంలో ఉన్న 582 పోలింగ్ కేంద్రాలను పరిశీలించి లోటుపాట్లను తమ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు. ప్రధానంగా మౌలిక సదుపాయాలను దృష్టిలో ఉంచుకొని వాటి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. నియోజకవర్గంలోని 582 పోలింగ్ కేంద్రాలను మొత్తం 41రూట్లుగా విభజించారు. ఈ సమావేశానికి 40 మంది సెక్టోరల్ అధికారులు, సుమారు 30మంది సెక్టోరల్ పోలీసులు హాజరయ్యారు.

బృందాలు నిర్వహించాల్సిన విధులను వివరించి, ఎన్నికల కోడ్ రాగానే ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేందుకు కృషి చేయాలని సైదులు ఆదేశించారు. కార్యక్రమాల్లో ఈఆర్వో వి.నర్సింహ, ఏఈఆర్వోలు మల్లయ్య, రెహమాన్, శ్రీహరి, రామకృష్ణ, మతిన్, నర్సింగ్‌రావు, బాలానగర్ ఏసీపీ హన్మంతరావు, సీఐలు, ఎస్ఐలు, మాస్టర్ ట్రైనర్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.


నాయకులతో సమావేశమైన హరీష్‌రెడ్డి

విజయ సంకల్పయాత్రను విజయవంతం చేయాలి

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న విజయ సంకల్పయాత్ర ఆదివారం కూకట్‌పల్లి నియోజకవర్గంలో కొనసాగుతోందని పార్టీ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం కూకట్‌పల్లిలోని బీజేపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. ప్రధాని నరేంద్రమోదీని మరోసారి ప్రధానిని చేసేందుకు దేశంలోని అన్ని వర్గాల ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని, తెలంగాణలో బీజేపీ మెజార్టీ ఎంపీ సీట్లు కైవసం చేసుకోబోతుందని హరీష్‌రెడ్డి పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు నాయినేని సూర్యప్రకాష్‌రావు, సూర్యారావు, శ్రీకర్‌రావు, బీజేవైఎం, మహిళా విభాగం నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలి


మాట్లాడుతున్న డీఈ సీహెచ్ భిక్షపతి, ఏడీఈ సూర్యప్రకాశ్

బాలానగర్/ ఓల్డుబోయినపల్లి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): వేసవిలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా అధికారులు, సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని బోయినపల్లి డీఈ సీహెచ్. భిక్షపతి శనివారం ఏడీఈ, ఏఈలకు సూచించారు. బాలానగర్ సబ్ డివిజన్ ఏడీఈ సూర్యప్రకాశ్, బోయినపల్లి సీబీడీ ఏడీఈ శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన వేర్వేరుగా నిర్వహించిన సమీక్షా సమావేశాల్లో సిబ్బందికి పలు విషయాలను వివరించారు. మార్చి నుంచి ఎండలు తీవ్రం కానున్న నేపథ్యంలో అధిక లోడ్‌ను తట్టుకునే విధంగా ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని సిబ్బందికి సూచించారు. విద్యుత్ తీగలకు ఆనుకొని ఉన్న చెట్లను తొలగించాలని చెప్పారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశంలో అధికారులకు వివరించిన అంశాలను సమావేశంలో సూచించారు. బాలానగర్‌లో జరిగిన సమావేశంలో ఏడీఈ పులి సూర్య ప్రకాశ్, బాలానగర్ ఏఈ మౌనిక, ఫిరోజ్‌గూడ ఏఈ రాణీబాయి, సిబ్బంది పాల్గొన్నారు.

షిరిడి సాయిబాబా ఆలయ బ్రహ్మోత్సవాలు


గీతాలు ఆలపిస్తున్న ఉష


పాల్గొన్న భక్తులు

చందానగర్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): చందానగర్ అన్నపూర్ణ ఎన్‌క్లేవ్ విశాఖ శారదపీఠా పాలిత షిరిడిసాయి బాబా ఆలయ 10వ బ్రహ్మోత్సవాలు మూడు రోజుల పాటు జరిగే వేడుకలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకం, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, సాయంత్రం అంకురారోహణ, మండపారాధన, అగ్నిప్రతిష్ఠ, దత్తాత్రే య, హోమాలు, రాత్రి గణేష్ ఎంటర్టైన్‌మెంట్ సంగీత విభావరిలో ప్రముఖ సినీ గాయని ఉష ఆలపించిన గీతాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ చైర్మన్ యూవీ రమణ మూర్తి, సభ్యులు జైపాల్‌రెడ్డి, చంద్రశేఖర్, చెన్నారెడ్డి, కరుణాకర్‌గౌడ్, అర్చకులు, పవన్ కుమార్‌శర్మ భక్తులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం


వైద్య శిబిరంలో సీనియర్ సిటిజన్స్, డాక్టర్లు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అశ్వితా సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ హోలిస్టిక్ ఆస్పత్రి హఫీజ్‌పేట రోడ్డులో శనివారం ఉచి త వైద్యశిబిరం నిర్వహించింది. ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్వహించిన వైద్య శిబిరంలో 8మంది డాక్టర్లు, సిబ్బంది సుమారు 90మందికి పైగా వయోవృద్ధులకు గుండె సంబంధిత ఆరోగ్య పరీక్షలు, బీపీ, షుగర్, 2డి ఎకో, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. సీనియర్ కార్డియాలజిస్ట్ డా.బిజ్జు గోవింద్ వయోవృద్ధుల ఆరోగ్య సమస్యలపై అడిగిన పలు ప్రశ్నలకు సమాధానమిచ్చారు. కార్యక్రమంలో ఆస్పత్రి చీఫ్ ఆపరేషన్ ఆఫీసర్ డా॥శ్రీనివాస్‌రెడ్డి, ఆస్పత్రి అసిస్టెంట్ మార్కెటింగ్ మేనేజర్ చంద్రశేఖర్, అసోసియేషన్ ప్రతినిధులు ఎస్.పాపారావు, భగవాన్ దాస్‌లద్దా, అజయ్‌యోగీ, రామకృష్ణారెడ్డి, వీరభద్రరావు, శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణ, సుధాకర్, అశ్విత మహేంద్ర, కమ్యూనిటీ మేనేజింగ్ కమిటీ మహిళా ప్రతినిధి ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగమంటూ మోసం

- ఇద్దరి అరెస్ట్.. మరొకరు పరార్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): నకిలీ ఆఫర్ లెటర్‌లు సృష్టిస్తూ ఎంతో మంది నిరుద్యోగులను బురిడీ కొట్టించి భారీగా డబ్బులు దండుకు న్న ఇద్దరు నిందితులను సైబరాబాద్ సైబ ర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నాడు. వివరాలు ఇలా.. ప్రకాశం జిల్లా మద్దిపాడు ప్రాంతానికి చెందిన ముచ్చు శివప్రసాద్(32), ధన్‌రాజ్, బట్టగిరి రంగాపార్థుడు(26)లు డబ్ల్యుఎస్ఎస్ గ్లోబల్ సర్వీసెస్ పేరిట ఉన్న కంపెనీని.. అదే పేరిట ఆన్‌లైన్‌లో సృష్టించి జాబ్‌ఫ్రాడ్‌కు తెరలేపారు. నకిలీ ఆఫర్ లెటర్‌లు సృష్టించి నిరుద్యోగుల నుంచి భారీగా డబ్బులు దండుకుంటున్నారు. ఓ బాధితుడికి గత నెల 26న ఓ కాల్ వచ్చింది. డబ్ల్యుఎస్ఎస్ గ్లోబల్ సర్వీసెస్‌లో అసోసియేట్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ జాబ్ ఉందని, ఆసక్తి ఉంటే సర్టిఫికెట్లు పంపించాలని సూచించారు. ఉద్యోగం రావాలంటే రూ.1.60లక్షలు చెల్లించాల్సి ఉంటుందని.. తొలుత రూ.20వేలు, ఆఫర్ లెటర్ వచ్చిన తర్వాత మిగతా డబ్బులు చెల్లించాల్సి ఉంటుందని మరో కాల్ ద్వారా వివరించారు. వారు చెప్పినట్టే రూ.20వేలు వారు చెప్పిన ఖాతాకు బాధితుడు పంపించేశాడు. మరుసటి రోజే ఇంటర్వ్యూ ఉందని, ఆన్‌లైన్‌లో ఇంటర్వ్యూ చేసినట్టు నటించి అతడు సెలెక్ట్ అయినట్లు మరుసటి రోజు(జనవరి 27న) ప్రకటించేశారు. జనవరి 29న అతడి చేతికి నకిలీ ఆఫర్ లెటర్ కూడా వచ్చేసింది. బాధితుడు నిజమిగతా డబ్బులు కూడా ఇచ్చేశాడు. తర్వాత హైటెక్ సిటీ అడ్రస్‌తో ఉన్న డబ్ల్యు ఎస్ఎస్ గ్లోబల్ సర్వీసెస్ పేరిట కంపెనీ ఉన్న అడ్రస్‌పై వెళ్లగా అక్కడి అధికారులు ఆ లెటర్ తమది కాదని.. ఎవరో మోసం చేశారని స్పష్టం చేశారు. అతడికి కాల్స్ వచ్చిన నెంబర్లకు కాల్ చేయగా ఎవరూ స్పందించలేదు. మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్‌క్రైం పోలీసులను ఆశ్రయించాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు శివప్రసాద్, రంగాపార్థుడులను అరెస్టు చేశారు. వారి నుంచి 3సెల్ ఫోన్లు, ల్యాప్‌టాప్, బ్యాంక్ పాస్‌బుక్, రూ.25 వేలు స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు ధన్‌రాజ్ కోసం గాలిస్తున్నారు. నిందితులపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో 12 కేసులు నమోదైన ట్టు పోలీసులు గుర్తించారు. బాధితులు ఇంకా చాలా మంది ఉంటారని.. వారు కూడా ముందుకొచ్చి ఫిర్యాదులు చేయాలని పోలీసులు సూచించారు.

మలేషియాలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేస్తే..

- అదనంగా ఒక సంవత్సరం గడిపే అవకాశం!

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అత్యుత్తమమైన యూనివర్సిటీలలో కొన్ని మలేషియాలో ఉన్నాయి. టెక్నాలజీ, మేనేజ్‌మెంట్, మెడిసన్ తదితర రంగాలలో తమ యూనివర్సిటీలకు అంతర్జాతీయంగా టాప్ 50 యూనివర్సిటీలలో స్థానం లభించిందన్నారు ఎడ్యుకేషన్ మలేషియా గ్లోబల్ సర్వీసెస్ (ఈఎంజీఎస్) సీఈఓ నోవి తాజుద్దీన్. నగరంలో మొదటిసారిగా బేగంపేటలోని ఓ హోటల్‌లో మలేషియా ఎడ్యుకేషన్ ఫెయిర్‌ను శనివారం నిర్వహించారు. మలేషియాలో అత్యుత్తమ యూనివర్సిటీలలో 8యూనివర్సిటీల ప్రతినిధులు హాజరైన ఈ ఎడ్యుకేషన్ ఫెయిర్‌కు నగరంలోని పలు మైనారిటీ కళాశాలల విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఈఎంజీఎస్ సీఈఓ నోవి మాట్లాడుతూ తొలిసారిగా ఇండియాలో తాము ఈ రోడ్‌షోలను చేస్తున్నామన్నారు. ఇప్పటికే చెన్నై, ఏపీలలో తమ ఎడ్యుకేష న్ ఫెయిర్ షోలను చేశామంటూ ఇక్కడ విద్యార్థుల నుంచి వస్తోన్న స్పందన అపూర్వమన్నారు. ఇటీవలే భారతీయ విద్యార్థుల కోసం తమ ప్రభుత్వం పోస్ట్ గ్రాడ్యుయేట్ వీసా తీసుకువచ్చిందంటూ, తమ విద్య ముగిసిన తరువాత కూడా ఓ సంవత్సరం పాటు విద్యార్థులు అక్కడ గడిపే అవకాశం ఉందన్నారు. అలాగే ఓ సంవత్సరం ఉద్యోగం చేసే అవకాశం కూడా లభిస్తుందన్నారు. మలేషియా హానరరీ కాన్సుల్ జనరల్, సౌత్ ఇండియా కె.శరవణ కుమార్ మాట్లాడుతూ మలేషియాలో అంతర్జాతీయ విద్యార్థులకు అపార అవకాశాలున్నాయన్నారు. కార్యక్రమంలో ఏసియా పసిఫిక్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్, సన్‌వే, తునుకు అబ్దుల్ రెహమాన్ యూనివర్సిటీ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ టెక్నాలజీ యూనివర్సిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంకా షాక్‌లోనే..

(5వ పేజీ తరువాయి)

ఫలితం లేకుండా పోయింది.' అంటూ తల్లి గీత కన్నీటి పర్యంతమవుతున్నారు. ఆమె ఇక లేదన్న వాస్తవాన్ని జీర్ణించుకోలేక దుఃఖసాగరంలో మునిగిపోతున్న తల్లి గీతను చూసి ప్రతి ఒక్కరి గుండె తరుక్కుపోతోంది.

దుఃఖ సంద్రంలో నివేదిత

లాస్య నందిత సగం ప్రాణంగా, మంచి అక్కగా అందరికీ సుపరిచితురాలైన నివేదిత పరిస్థితి మరీ దయనీయంగా మారింది. లాస్య మరణ వార్త విన్నప్పటి నుంచి నివేదిత రోదిస్తూనే ఉన్నారు. ఎవరు పలకరించినా దుఃఖం కట్టలు తెంచుకుంటోంది. కార్ఖానాలోని సాయన్న నివాసానికి వచ్చే ప్రతి ఒక్కరినీ అక్కా చెల్లెళ్లు నివేదిత, లాస్య నందితలు ఆప్యాయంగా పలకరిస్తుంటారు. లాస్య మృతితో నివేదిత దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆ క్షణం నుంచి ఈ క్షణం వరకూ రోదిస్తూనే ఉన్నారు. సాయన్న ఇంట్లో కాలు పెట్టగానే నవ్వుతూ దర్శనమిచ్చే అక్కాచెల్లెళ్లలో చెల్లి ఇక లేదన్న వాస్తవాన్ని జీర్ణించుకోలేక జనం కూడా నిర్వేదానికి గురవుతున్నారు.

కేపీ వివేకానంద్ ప్రత్యేక పూజలు

షాపూర్‌నగర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): నల్లగుట్ట ద్వాదశ జ్యోతిర్లింగ 23వ పూజా మహోత్సవానికి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై శివ గురుస్వామి దూదిమెట్ల సోమేష్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించా రు. అడిగిన వెంటనే దేవాలయ అభివృద్ధిలో భాగంగా రోడ్డు నిర్మాణం చేపట్టి నందుకు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్త సోమేష్ యాదవ్ ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో ఫాక్స్ డైరెక్టర్ పరిశ శ్రీనివాస్ యాదవ్, మాజీ కార్పొరేటర్ వెంకటేశ్వర రావు, విజయ్‌రామ్‌రెడ్డి, భాస్కర్, శ్రీకాంత్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి అభినందనీయం : ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మియాపూర్ డివిజన్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో, ప్రైమరీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సినాప్సిన్ సాఫ్ట్‌వేర్ సంస్థ సౌజన్యంతో నిర్మాణ్.ఓఆర్‌జీ ఆధ్వర్యంలో నూతనంగా సోలార్ వ్యవస్థ, మూడు అదనపు తరగతి గదులు, సైన్స్‌ల్యాబ్ పరికరాలు, గ్రీన్ బోర్డులను ఏర్పాటు చేశారు. శనివారం వీటిని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ సంస్థ ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంస్థ ప్రతినిధులను అభినందించారు. సినాప్సిన్ సంస్థ పేద విద్యార్థులకు మేలు జరిగేలా సోలార్, అదనపు తరగతి గదులు ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సినాప్సిన్ సంస్థ సైట్ డైరెక్టర్ నరేం ద్ర, సీనియర్ మేనేజర్ నర్సింహ, నిర్మాణ్ సంస్థ కోఆర్డినేటర్ అనురాధ, భార్గవరామ్, భగవాన్, హెచ్ఎం వసుంధరదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాడ్మింటన్ విజేతలకు బహుమతుల ప్రదానం

మియాపూర్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): చందానగర్ దీప్తిశ్రీనగర్ కాలనీ పార్కులో దీప్తిశ్రీనగర్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బ్యాడ్మింటన్ ప్రీమియర్ లీగ్-2024 శనివారం నిర్వహించారు. విన్నర్స్‌గా కేపీ కంగారు, రన్నర్స్‌గా మాస్టర్ బ్లాస్టర్స్, సెకెండ్ రన్నరప్‌గా చౌదరి వారియర్స్ గెలుపొందారు. బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. గాంధీ మాట్లాడుతూ కాలనీ అసోసియేషన్ బ్యాడ్మింటన్ ప్రీమియర్ లీగ్ నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, డివిజన్ అధ్యక్షుడు రఘునాథ్ రెడ్డి, మాజీ డీఎస్పీ సుంకర సత్యనారాయణ, మాదాపూర్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

వివేకానందనగర్‌కాలనీ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి డివిజన్ పాపారాయుడునగర్‌లోని సంజీవ అంజనేయస్వామి దేవస్థానం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కార్పొరేటర్లు శ్రీకాంత్, సంజీవరెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, పెద్ద భాస్కర్‌రావు, ప్రసాద్, పోతుల రాజేందర్, కాశీనాథ్, వెంకట్ రావు, దేవేందర్‌రావు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

నాలుగో అంతస్తు నుంచి పడి వ్యక్తి మృతి

దుండిగల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): నాలుగో అంతస్తు నుంచి జారిపడి వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బహదూర్‌పల్లి గ్రీన్‌హిల్స్ కాలనీలో శనివారం జరిగింది. ఒడిశాలోని గంజాం, లాలపేట్ గ్రామానికి చెందిన రమేష్ చంద్రప్రదాన్(50) బతుకు దెరువు కోసం 15రోజుల క్రితం నగరానికి వచ్చి భవన నిర్మా ణం వద్ద కూలీగా పనిచేస్తున్నాడు. విధి నిర్వాహణలో నిమగ్నమై అతను ప్రమాదవ శాత్తు కాలుజారి నాలుగో అంతస్తు నుంచి కిందపడి మృతి చెందాడు. దుండిగల్ పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బెదిరించి ఇంట్లో చోరీ

గాజులరామారం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ముసుగు వేసుకొని ఇంట్లోకి వచ్చి బంగారం ఎత్తుకెళ్లారు. సూరారం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. సూరారంలో నివాసం ఉండే శివలక్ష్మి(50) జ్యోతిమిల్క్ డైరీ ఫామ్‌లో కాంట్రాక్టు వర్కర్. శుక్రవారం మధ్యాహ్న భోజనం తినేందుకు ఇంటికి వచ్చి తలుపులు వేయకుండానే మంచంపై వాలింది. ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ముఖాలకు నల్లరంగు గుడ్డ ధరించి ఇంట్లోకి వచ్చి మహిళను బెదిరించి బీరువాలో ఉన్న తులం బంగారు కమ్మలు, మాటీలు దోచుకెళ్లారు. శివలక్ష్మి సూరారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

మియాపూర్: కొండాపూర్‌లోని నీలం రాజశేఖర్‌రెడ్డి పరిశోధన కేంద్రంలో శనివారం జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను అన్వర్ బాషా, డాక్టర్ బీవీ విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు కె.నారాయణ హాజరయ్యారు. ఈసందర్భంగా నేడు కావాలి సైన్స్. లేదా మూఢనమ్మకాలు అనే అంశంపై వకృత్వ పో టీలు నిర్వహించారు. విజేతలను ఎంపిక చేసి మొదటి 4 స్థానాల్లో నిలిచిన వారికి నారాయణ బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా ప్రజానాట్య మండలి మహాభాష్యం పాఠశాలకు చెందిన 15మంది విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.


గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేస్తున్న నారాయణ

'కాలనీ అభివృద్ధికి తోడ్పడాలి'

గాజులరామారం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కాలనీల్లో నూతనంగా ఏర్పడిన అసోసియేషన్ సభ్యులు కాలనీ అభివృద్ధికి తోడ్పడాలని కార్పొరేటర్ రావుల శేషగిరి అన్నారు. గాజులరామారం డివిజన్ రావి నారాయణ రెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శనివారం కార్పొరేటర్ రావుల శేషగిరి మర్యాద పూర్వకంగా కలిశారు. కాలనీ అభివృద్ధికి అసోసియేషన్ సభ్యులు తోడ్పడాలని కార్పొరేటర్ సూచించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు సాతాల గోపాల్, ఆలయ చైర్మన్ బి.నర్సింహ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఆర్గనైజర్ ప్రసాద్, బాలయ్య బస్తీ అధ్యక్షుడు నగేష్, చిన్న పాల్గొన్నారు.

క్రికెట్ కిట్లు, చీరల పంపిణీ

మియాపూర్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పటేల్ శ్రీకృష్ణ ఆశయాలను నెరవేర్చడమే లక్ష్యంగా శ్రీకృష్ణ యూత్ సభ్యులు కృషి చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. శనివారం శ్రీకృష్ణయూత్ అధ్యక్షుడు అభిషేక్‌గౌడ్ జన్మదినం సందర్భంగా రాయదుర్గంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మహిళలకు చీరలు, యువకులకు క్రికెట్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మూల వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారానికి కృషి'

హైదర్‌నగర్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని శంషిగూడ, సాయిచరణ్‌కాలనీ, శ్రీరాంనగర్, కృష్ణవేణి కాలనీ, సాయిప్రశాంత్‌నగర్, ఇంద్రాహిల్స్‌లో నెలకొన్న తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, వీధి దీపాలు, విద్యుత్ స్తంభాల సమస్యలపై శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. కాలనీల్లో నెలకొన్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జీ జగదీశ్వర్‌గౌడ్ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో వాటర్‌వర్క్స్ మేనేజర్ ప్రశాంతి, డివిజన్ అధ్యక్షుడు మారేళ్ల శ్రీనివాస్, నాయకులు మన్నేపల్లి సాంబశివ రావు, ప్రభాకర్, రూబెన్, గోపాల్, లింగం, సంగారెడ్డి, సుధాకర్, సుధీర్ రెడ్డి పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన

బాలానగర్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): వర్షపు నీటి కాలువ నిర్మాణాలను త్వరగా పూర్తి చేసి వర్షాకాలంలో ప్రజలు ఇబ్బంది పడకుండా చూడాలని కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి సూచించారు. శనివారం ఆయన దిల్‌కుష్‌నగర్‌లో అధికారులతో కలిసి పర్యటించి అక్కడ చేపట్టనున్న వర్షపు నీటి కాలువల నిర్మాణానికి సంబంధించిన ఏరియాలను పరిశీలించారు. కార్యక్రమంలో దిల్‌కుష్‌నగర్ బస్తీ నాయకులు ఎండీ మోసిన్, ఎండీ జమీల్, డీఈ బాలకిషన్, ఏఈ రషీద్, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శ్యామ్‌రావు



దుండిగల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బహదూర్‌పల్లి గ్రామానికి చెందిన దాసరి శ్యామ్‌రావు నియమితులయ్యారు. ఈమేరకు బీజేపీ రాష్ట్ర ఎస్టీ మోర్చ అధ్యక్షుడు జె.కల్యాణ్‌నాయక్ శనివారం ఆయనను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.